# బర్రె

ఆ ఇంటి పెరట్లో... ఓ మూలకి...

కంపువాసన కొడుతూ... రొచ్చు రొచ్చుగా వుంది. 'మట్టు'కి కట్టేసిన బర్రె పోసిన మూత్రంతో బురదగా మారి దాని చుట్టే రొచ్చుగా వుంది.

ఏ మడుగులో పడుకుందోగాని... దాని శరీరం మీద ఎండిపోయి పగుల్లు వారిన బురద. తోకతో అదిలిస్తున్నా జొబ్బుమంటున్న ఈగలు...

మెడకింద రక్తాన్ని పీలుస్తున్న జలగ....

పొదుగుకింద పుట్టెడు గోమార్లు...

మెడమీద ఒరుసుకుంటున్న ఇనుప గొలుసు...

కాళ్లను కుట్టేస్తూ చిరాకు తెప్పిస్తున్న అడివి దోమలు...గుడ్డీగలు...

బర్రెకి అసహనంగా వుంది... తన బతుకుమీద తనకే రోతగా వుంది. ఏవో మాటలు విన్పించటంతో తలతిప్పి చూసింది. ఇంటి యజమాని మంచంపైన మనవడ్ని ఒళ్లో కూచోబెట్టుకొని కథ చెప్తున్నాడు.

'అనగనగా ఒక ఆవు... అమ్మలాంటి ఆవు...'

బర్రె మనసు చివుక్కుమంది.

తను, తన వంశం ఈ ఇంటికి కొన్ని వందల ఏళ్ళుగా 'పాలి'స్తున్నా... వాటితో చాయలు, కాఫీలు, పెరుగు, వెన్న నెయ్యి తరతరాలుగా వీళ్లు ఆరగిస్తున్నా... ఈ ఇంట్లో ఎప్పుడూ కన్పించని ఆవుమీద వీళ్లకు గొప్ప ప్రేమ... అభిమానం... గౌరవం... భక్తి... ఆప్యాయత...

తమ ఉనికిని పాతిపెట్టేసి... ఆవుని జపించడం ఎంత వరకు న్యాయం అనుకుంది ఆ ఇంటి పాలేరు చెంద్రిగాడు ఎండుగడ్డి తెచ్చి బర్రెముందరేసాడు.

వాడిదీ తనలాంటి రంగు శరీరమే....

వాడిదీ తనలాంటి బతుకే...

"ఆవు శరీరంలో 33 కోట్లమంది దేవతలుంటారు. పుట్టలో పడిపోయిన వెంకటేశ్వరస్వామికే పాలు ధారబోసి బతికించిన పుణ్యశీలి..."

కథ నడుస్తోంది....

బాధగా కూలబడి... కళ్లు మూసుకొని నెమరేసుకుంటూ కథ వింటోంది. దేవుడికి పాలుపోసిన మాట దేవుడెరుగు...

ఈ మనిషి కూతురు ప్రసూతయి.. పాలు రాకపోతే పసిగుడ్డుకి మూడు నెలలు తన పాలు తాగించి బ్రతికిచ్చారే...

పుక్కిటి పురాణాల ద్వారా ఆవు గొప్పదైతే... పొద్దు పొడవక ముందు నించి రాత్రిళ్లు పండుకునేదాకా తన పాలతో బతికే వీళ్లకు బర్రెజాతి నామోషి ఎలా అయింది...??

నిజంగా.... వీళ్లెంత కృతఘ్నులు అనుకుంది బాధగా.

చెంద్రిగాడు పసిగడుగులతో నిండిన కుడితి బకెట్టు తెచ్చి పెట్టాడు. ఆ పులుపు వాసన ముక్కు రంధ్రాలకు తగలగానే... ఆశగా లేచి నిల్చుంది. తనుగు విప్పి దుడ్డెని విడిచిపెట్టాడు. అది చెంగు చెంగున వచ్చి పొదుగుని కుమ్మింది. తల్లి ప్రేమతో జాలువారిన పాలు... కాని దాని గొంతు తడువక ముందే బలవంతంగా దాన్ని లాక్కెళ్లి మట్టుకి కట్టేసాడు చెంద్రిగాడు. పొదుగు దగ్గర కూచొని ఇత్తడి సర్వ మోకాళ్లమధ్య పెట్టుకొని... ప్రాణాలు పోయేంతంగా పాలు పితికాడు.

హ్రాయ్... అంటూ ఆశగా అరుస్తున్న దుడ్డెని విడిచివెళ్లిపోయాడు. అది పొదుగునెంత కుమ్మినా... పాల చుక్క రాలేదు.

బర్రె కళ్ళల్లో మాత్రం... కన్నీటి చుక్కలు రాలిపడ్డాయి.

ఏనాడూ తన బిడ్డలకి కడుపునిండా పాలివ్వలేని జాతి... పెయ్యదూడని పెడితేనే సాకి... 'పోతుని' కంటె పొదుగు మరువకముందే అమ్మేసే మనుషుల్ని నిశ్శబ్దంగా క్షమిస్తున్న జాతి...

'గోవు మాలక్ష్మికి కోటి దండాలు...'

కథలో భాగంగా తాత పాడుతుంటే మనవడు విచిత్రంగా వింటున్నాడు. ఆ పాట విని బర్రె మనసు బాధగా మూలిగింది.

బిడ్డ తండ్లాట చూసి పాలు లేవని చెప్పలేక రొచ్చులో కూలబడింది. కుడితి బక్కెట్లో అడుక్కి మిగిలే అన్నం మెతుకుల కోసం ముక్కుతో బోర్లేస్తే ఇంటి యజమానురాలు వచ్చి తిడుతూ బక్కెట్టు తీసికెళ్లింది. ఇంకిపోని కుడితినీళ్ల పై జొబ్‌మని వాలిన ఈగలు.

"అందుకే గోదానమెంత గొప్పదో... గోహత్య అంత పాతకమని అర్థమైంది కదా" కథ కంపరమెక్కిస్తోంది...

ఇనుప గొలుసు తెంపుకొని పారిపోవాలన్నంత కంపరం...

xxx xxx xxx

ఆ మడుగుని.... బర్ల మడుగంటారు.

చిక్కటి బురదలో సగం శరీరం లోపల... సగం బయట కన్పిస్తూ నిశ్శబ్దంగా పడుకున్నాయి. వాటి వీపులమీద ఎగురుతూ తెల్లకొంగలు... మెల్లగా ఎగబాకుతూ జలగలు మొహమంతా చిన్న బుచ్చుకొని కన్నీరు కారుస్తున్న బర్రెని చూసి ఏమయిందని అడిగినయ్ కాపోల్ల బర్రె... శాలోల్ల బర్రె... అవుసులోల్ల బర్రె...

"మా ఇంటాయన పేపర్ సదువంగ విన్నా... గోవధ నిషేదించాలని కొన్ని పార్టీలు ర్యాలీలు ధర్నాలు చేస్తున్నయని... నా మనసు బరువెక్కింది. వాటికన్నా జనాభాలో మనమే ఎక్కువ. అల్‌కబీర్ కాడ వందల సంఖ్యలో తెగనరుకుతున్నది మనల్నే. మనకోసం... ఒక్కరంటే ఒక్కరు... పాటుపడరెందుకు?" అంది.

దాని గంభీరమైన ప్రశ్నకి మిగితాబర్రెలు మౌనంగానే వుండిపోయాయి. కొన్ని బర్రెలు ఇటువైపు తల తిప్పాయి చెవులూపుకుంటూ...

నిశ్శబ్దం ఆవరించింది.

"ఆవులకు పురాణ కథల్లో చోటు... సంస్కృతుల్లో భాగం... సాంప్రదాయాల్లో పెద్దపీట... బక్కెట్లకొద్దీ పాలిచ్చినా మనకోసం ఏ సంప్రదాయాల్ని పాటిస్తున్నారు. గతంలో... ఏడాదికోసారి మననిండా పసుపు కుంకాలు బుక గుల్లాలు చల్లి కాట్రేవులకు చేసెటోల్లు... అదీ అడవిలో మనల్ని కాసే కాపరులు మాత్రమే. ఇప్పుడదీ మర్చిపోయారు..."

దాని మాటల్లోని వేదన... మిగతావాటిని చుట్టుముట్టింది.

అప్పుడే బర్లమందని కాసే రాం'నర్సడి పదేళ్లకొడుకు తండ్రికి సద్దిగిన్నె ఇచ్చి ప్రేమగా పరిగెత్తుకొచ్చి ఓ బర్రెమీదెక్కి కూచున్నాడు.

వాడి మొహం నిండా సంతోషం...

ఢిల్లీలో సాహస అవార్డులందుకునే బాలలు ఏనుగు అంబారీ మీదెక్కినప్పుడు కూడా అంతగా సంతోషపడరేమో... 'చల్‌ఛల్ గుర్రం... చలాకి గుర్రం' అంటూ ఆడుతున్నాడు వాడు...

"ఆ పిల్లాడ్ని చూడండి... వాడిదీ మనలాంటి బతుకే, ఆవు, గోవు అంటూ కలవరించే వాళ్ల పిల్లలు మరి ఆవులమందల్ని కాయట్లేదెందుకు? వాడొక అస్పృశ్యుడు... మనమూ అస్పృశ్యులమే... అందుకే వాడి కుటుంబం తరాల్నించి మనల్ని కాయడానికే త్యాగం చేస్తోంది. మనమూ అంతే.."

బర్రెలన్నీ బరువుగా నిట్టూర్చాయి. గాయపడ్డ ఒక బర్రె లేచి నిల్చుంది. దాని నల్లటి శరీరం మీద ఇంకా నల్లగా కమిలిపోయిన వాతలు...

"పంట దిగుబడి రావాల్నని పక్క వూర్లె నించి ఆవుని కిరాయికి దెచ్చి చేండ్లల్ల మేపింద్రు. పచ్చగడ్డికోసం నేను పొలంలో దిగితే బాగా కొట్టి బంజరిదొడ్లె వేసింద్రు. నా యజమాని కూడా రెండు వందల జుర్మాన కట్టలేదు. దాంతోని ఇంక రెండ్రోజులు బంజరిదొడ్లనే వుంచి ఇడిసిపెట్టింద్రు. ఆకలికి దూపకు చచ్చిపోయిన..."

దాని శరీరగాయం కన్నా... దాని మనసుకి పడ్డ గాయం దుఃఖభరితంగా వుందని మాటలే చెప్తున్నాయి.

మరో బర్రె లేచింది... మొహం మీద పాకుతోన్న జలగని విదిలిచ్చింది. "సూడికత్తలేమని వూరోల్లంత రెండువేలు పెట్టి జయితాల అంగట్ల పోతుని కొనుక్కచ్చింద్రు. ఇంటింటికి తెల్కపిండివెట్టి దాన్ని పాణమోలె చూసుకున్నరు. అందరం సూడికి రాంగనే పోతుని ఎవ్వలూ పట్టించుకోలె. దాని మెడమీద పుండయింది. పురుగులు పడ్డయ్.గాల్లయినయి. ఎవడో కాలుమీద కొట్టిండు. గడ్డిగాసం దొరుకక బక్కపడి గుట్టలపొంటి తిరుగుతంది" అన్నది.

"సూడి అంటె యాదికచ్చింది. నేను సూడిమీదుండి తీగలెయ్యంగ కూడా మా ఇంటోల్లు పట్టిచ్చుకోలె. అద్మరాత్రి మాయి పడేదాక పాపం రాయనర్సన్ననే కావలికాసిండు. తెల్లారి జున్నుపాలు మాత్రం ఇంట్లోల్లు జుర్రుకుంటు తాగింద్రు. రాయనర్సన్నకు కూడా గిలాసెడు పొయ్యలే" అంది మరో బర్రె.

"ఆవు మూత్రం పాకెట్లల్ల పోసి అమ్ముతుంద్రు. ఆవు పేడ బంగారంతోని సమానంగా సూత్తుంద్రు. బోపాల్ విషవాయులప్పుడు అందరు చచ్చిపోయినా ఆవు పేడతోని యజ్ఞం చేసిన ఓ ఇంట్ల విషవాయువులు ఏం పని చేయలేదని పత్రికలోల్లు మొత్తుకున్నారు. తెల్లారితే ఇంటింటికి మన పెండతోని అలుకు చల్లుకుంటున్నా మన పెండకు, మూత్రానికి విలువేలేకపాయె. పిడుకలకు తప్ప దేనికి పనికిరాదన్నట్టు

చేసిరి. అమృతం తాగేటప్పుడు బ్రహ్మనోటి నుంచి కారుతున్న నురగలకెల్లి ఆవు పుట్టిందంటరు. మన పుట్టుపూర్వోత్తరాల గురించి ఎవలు కథలల్లకపాయిరి" అంది.

దాని మాటలు మిగితా బర్రెలకు ఆశ్చర్యం గొలిపినయ్...

"ఒక్కనాడు రాయనర్సన్న జ్వరమచ్చి పడుకుంటె... ఇండ్లల్ల మనల్ని ఎంత చీదరిచ్చుకున్నారు. ఆవుకు మనకు తోలు రంగు మాత్రమే తేడా. పాల రంగుల్ల తేడాలున్నయా? గిదెక్కడి న్యాయం" అంది ఇంకో బర్రె.

"బతికున్నన్ని రోజులు మనపాలు తాగుతరు. చచ్చిపోయినంక నెలనెలా పిండాలు పెట్టంగ ఆవుపెండతోనే అలుకుతరు. మన పాలేంది.. మన గడ్డి కూడా తింటుండ్రు" అంది కొంచెం రాజకీయం తెల్సిన బర్రె.

"ఆవు ముఖంలో నాలుగు వేదాలుంటె... మన ముఖం దేనికి పనికి రానిదెట్లయితది? అందరిది ఒక్కటే జాతికదా" అంది మరొకటి.

"ఆవు తన జీవితకాలంలో నాలుగు లక్షల పదివేల నాలుగు వందల నలభై మందికి ఒక పూట భోజనాన్నిస్తుందని ప్రచారం చేస్తున్నారు. ఈ లెక్కన మనం ఎన్ని లక్షల మందికి కడుపు నింపుతున్నం. ఈ లెక్కలన్నీ తేలాలె. భారతదేశం పాల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో వుందంటే కారణం ఆవు కాదు" ఆర్థిక శాస్త్రం తెలిసిన ఓ బర్రె లెక్కలేసి చెప్పింది.

ఇలా... వాటి మధ్య చర్చ తీవ్రంగా సాగింది.

తమ ఉనికి కోసం తల్లడమల్లడమయ్యాయి... అన్నీ కలిసి ఏకగ్రీవంగా ఒక తీర్మానం చేసాయి.

"మనకూ కొమ్ములున్నాయి... అవసరమైతే తిరగబడాలి"

xxx xxx xxx

పాలేరు చెంద్రిగాడు పాలు పిండి దుడ్డెని విడిచిపెట్టి ఇంటికి వెళ్లిపోయాడు. దుడ్డె చెంగలిచ్చుకుంట పొదుగుని కుమ్ముతోంది...

బర్రె మనసంతా నిన్న మందలో సాగిన చర్చనే నెమరేసుకుంటోంది. ఇన్నాళ్లూ జడత్వంలా వున్న మనసూ... శరీరంలో ఏదో ఊరట.

పెయ్యదుడ్డెని ప్రేమగా నాకింది "దీని బిడ్డల నాటికైనా సంస్కృతిలో... సాంప్రదాయాల్లో గౌరవం దక్కాలి. హిందూత్వ అజెండాలో చోటు దక్కాలి. గోపురాణాల్లాగా సాహిత్యంలోనూ స్థానం దక్కాలి. ఇచ్చే పాల పట్లనే కాకుండా తమ జాతిపట్ల ప్రేమ దక్కాలి... ఏనాటికైనా జాతీయ జంతువుగా నిలిచిపోవాలి..." అనుకుంది.

నల్ల రంగు అతి గొప్ప రంగు అని జాతి యావత్తు గుర్తించిన రోజు తమనీ గౌరవిస్తారని ఆశపడింది. అప్పుడైనా ప్రపంచవ్యాప్తంగా... 365 రోజుల్లో ఏదో ఒక రోజు 'బఫెల్లో డే' గా ప్రకటించబడుతుందని ఆశించింది...

తర్వాత... తనవన్నీ పిచ్చి ఆశలేమోనని నవ్వుకుంది...

ఇంతలో... బక్కెట్టు తీసుకెళ్ళడానికొచ్చిన ఇంటాయన బర్రె ముందర వేసిన గడ్డిని కాళ్ళతో రొచ్చులోకి జరుపుకున్నందుకు.... కోపంగా చూసిండు.

'గడ్డి దొరక్క చస్తుంటే... నీకు తిండి ఎక్కువైందే' అంటూ పక్కనున్న కంకకట్టె తీసి చివాలున కొట్టిండు. మందం తోలు అయినా శరీరమంతా చివ్వుమంది.

బాధని ఆపుకోలేని బర్రె వెనక్కి తిరిగి... ఒక్కసారిగా డొక్కలో కుమ్మింది. ఇంటాయన బొక్కబోర్లా పడ్డాడు.

"రాంద్రీరా... బర్రె పొడిచింది... రాంద్రి...పండ్లల్లకెల్లి రక్తమొస్తుంది...

రాంద్రిరా” అని మొత్తుకున్నడు. లేవలేకపోయింది. శరీరమంతా పెండ, రొచ్చు అంటినయ్.

అందరు పరిగెత్తుకొచ్చింద్రు... ఇద్దరు లేవట్టింద్రు...

ఇంటాయన కొడుకు అదే కంకకట్టెతోని బర్రెని విపరీతంగా కొట్టిండు. దుడ్డె బెదురు చూపులు చూసింది. కొమ్ములిరిగేటట్టు కొట్టిండు...

“రేపే కొత్తింట్లోకి గృహప్రవేశం... ఇదేం అపశకునంరా దేవుడా” అని బర్రెను తిడుతూ శోకాలందుకుంది ఇంటావిడ... రాత్రంతా... చీకట్లనే బిడ్డని నాకుతూ కన్నీరు కార్చింది బర్రె. ఆ రాత్రి గడిచింది.. నల్లతోలు చిట్లిపోయి లేచిన ఎర్రటి వాతలపై దోమలు కుడ్తుంటే... పొద్దుట మందలోకి బర్రెను విడువలేదు. ఎవరూ దాన్ని పట్టించుకోలేదు.

బర్రె ఆశ్చర్యపోయింది. తర్వాత అనుమాన పడింది. అది అనుకున్నట్లు గానే తొమ్మిదింటికల్లా... గొడ్లబేరం చేసే గోరేమియా వచ్చి బర్రెని ఎగాదిగా చూసాడు. “ఎనిమిది ఈతల బర్రె... ఏముంది దీంట్లో... ఆరు వందలిస్తా” అన్నాడు ఇంటాయనతో... పిలికితే నెత్తుటి చుక్కలు రాలేటట్టు... బర్రె గుండె పాదుగులోకి జారిపోయింది. ఆ మాటలు విని...

## అల్ కబీర్

మందలో బర్లన్నీ తరచూ దాని గురించే భయంభయంగా ముచ్చటించు కునే పదమది... పాలివ్వటం ఆగిపోయాక... మా ఎముకల్ని సైతం నుజ్జునుజ్జు చేసి కప్పు సాసర్లుగా మార్చుకుంటూ... గొడ్డుబోయిన పశుజాతిని ‘కోత’కి అమ్మేసే నరజాతి స్థాపించుకున్న ‘వధ్యశిల’ కర్మాగారం అది...

బర్రె వణికిపోయింది...

బేరం ఎనిమిది వందలకు కుదిరింది... పెయ్యదూడని చెంద్రిగాడి కిచ్చారు. అదీ... రెండు మూడేండ్లు సాదినంక ఈతకు రాగానే మొదటి దుడ్డెను వాడు ఉంచేసుకొని... పాలిచ్చే బర్రెని అప్పగించాలి అన్న షరతు మీద.

మట్టు దగ్గర గొలుసు విడిచి లాగాడు గోరేమియా. కదల్లేక... కదల్లేక.. మౌనంగా అనుసరించింది బర్రె...

అనుసరించక తప్పలేదు...

చివరిసారిగా బిడ్డవైపు తిరిగి.. తిరిగి చూసింది... అది మెడ చాపి దీనంగా చూస్తుంటే తట్టుకోలేక తల తిప్పుకుంది... వెనకనించి హ్రాయ్... అన్న పిలుపులు... వీధి మలుపులో... ఇంకొన్ని బర్రెలు, బక్కచిక్కిన ఎడ్లతో, గొడ్లతో నిండి వున్న లారీని చూసింది.

ఇప్పుడు తనవెంట... ప్రేమగా నాలుగు కాళ్ల సందుల్లో జొరబడే తన బిడ్డల్లేరు... పేడకోసం అంచెల్లో పరిగెత్తుకొచ్చే పిల్లలూ లేరు...

నిర్వేదంగా అడుగులేస్తుంటే...

ఎదురుగా బాజాభజంత్రీలు ఎదురయ్యాయి...

మేళ తాళాలు హోరెత్తిపోతున్నాయి...

పిల్లలూ... పెద్దలూ భక్తి పారవశ్యంతో డాన్సులు చేస్తున్నారు...

అందరి మధ్యన... హుందాగా నడుస్తున్న... ఆవు!!

దాని మెడలో దండలు... నుదుట పసుపు కుంకుమలు... పండితుల వేదమంత్రాలు... ఆవు మీద కప్పిన పట్టు వస్త్రం...

తన పక్కనించే సాగిపోతుంటే... అందరూ ఆవుకు పడిపడి దండాలు

పెడుతున్నారు...

ప్రార్థించే కన్నీళ్ళతో చూసింది బర్రె...

తన యజమాని, ఇంటావిడా... ఇన్నేండ్లూ తన పాలు తాగినవాళ్లెవరూ... కనీసం పట్టించుకోలేదు.

హ్రాయ్...

హ్రాయ్...

హ్రాయ్...

కంఠనరాలు తెగిపోయేలా అరిచినా బర్రె దిక్కే చూల్లేదు...

“ఆవు నాలుగు పాదాల్లోనూ ధర్మార్థ కామ మోక్షాలుంటాయి. అందుకే ఆవుతో నూతన గృహప్రవేశం చేయిస్తే అష్టయిశ్వర్యాలు” ఎవరో అంటున్నారు.

బర్రె మనసు బరువుగా మూలిగింది.

‘నిన్న చివరిసారిగా పిండిన తన పాలతోనే కదా... ఇవాళ కొత్తింట్లో పాలు పొంగిస్తారు...’

ఆ ఆలోచనతో బర్రెలో కన్నీళ్లు పొంగాయి.

వాకిట్లో... ఆవు కాళ్లని కడిగి తలలపై చల్లుకున్నారు.

ఆవు గడపదాటి కొత్త ఇంట్లో అడుగేసింది...

బర్రె చెక్కబల్లనెక్కి లారీలో అడుగుపెట్టింది...

మిగతా పశువులు దీనంగా చూస్తున్నాయి... అన్నింటిలోనూ గుబులు పొంగే కళ్ళకింద చారలు కట్టిన కన్నీళ్లు...

'చచ్చేముందు వాహనయోగం' ఓ ముసలి బర్రె జీవం లేని నవ్వు నవ్వింది. లారీ వెనక వుండే చెక్కబల్లని ఇనుప గొలుసుల్తో కట్టి మూసేసారు.

ఎక్కన్నించో... అంబా అంటూ... హ్రాయ్ అంటూ... జాలి గొలిపే బిడ్డల పిలుపులు... ఒక కుదుపుతో కదిలిన లారీలోంచి కన్నీళ్లతో చూసింది బర్రె...

గుండె పగిలింది...

దుఃఖం ఎగజిమ్మింది...

మసక మసగ్గా... వీధి

దూరమైపోతున్న ... ఊరు

ధ్వంసమైపోతున్న .... బంధం

లారీ వేగం పెరిగి రోడ్డెక్కుతుంటే... వణికే గొంతుతో మరిగే కన్నీళ్లతో శపించింది.

"పాలు తాగి విషం కక్కే ఈ మనుషుల్లోని అనుబంధాలు...

అంతరించి పోనీ...

అంతరించిపోనీ...

మత దైవంగా ఆవుని ప్రేమిస్తూ... మమ్మల్ని అంటరాని వాళ్లుగా మార్చిన ప్రభుత్వాలు...

కూలిపోనీ...

కూలిపోని..."

*